


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**81**

(12' నవంబర్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**మొన్న మా** బంధువుల్లో ఒకరి అబ్బాయికి పెళ్ళి అయింది. అతగాడు సిక్కింలో ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్ళి అయిన పదిరోజులకే భార్యను తీసుకుని సిక్కిం బయలుదేరడానికి నిశ్చయించాడు. ఎవరు కాదంటారు!? జంటగా మారిన తర్వాత ఒకరివెంట ఒకరు తరుముకుంటూ తిరగవలసిందేకదా..

***రెక్కలమీద కూర్చో ప్రేయసి***

కథల్లో, నాటకాల్లో కొన్ని డైలాగ్స్ వింటూ వుంటాం – "ప్రేయసి! నిన్ను నా రెక్కలమీద ఎక్కించుకుని ఆకాశపుటంచుల్లోకి పారిపోతా.. కొండ శిఖరాలమీద వ్రాలుతా! నువ్వు సిద్ధంగా వుండు.. ఇద్దరికీ ఈ ప్రపంచంతో సంబంధంలేదిక" – అలాగే.

"అది విమానము
ఆగివున్నది మనలకొరకై
స్నిగ్ధ హృదయానంద
చిత్తులు జేరవచ్చు
దానిపై....
నీకు నాకీలోకమేటి
ప్రాకిపోదము నాకభూమి
ప్రణయజ్యోత్స్న వికసితంబగు
పథిని పోదము నెచ్చెలీ!

అనే గేయం కూడా వింటూవుంటాం. ఇవన్నీ కావ్యాల్లోనుంచి, కథల్లోనుంచి నిత్యజీవితాలలోకి వురికినాయి. ఈ కాలంలో చాలామందికి కనిపించని రెక్కలు వచ్చినాయి. వెళ్ళి వెళ్ళి వేలమైళ్ళలో వెళ్ళి వ్రాలుతున్నారు.

పైన చెప్పిన ఉద్యోగి సిక్కిం గురించి మాట్లాడుతూ అది యే సిద్ధిపేటో, చిలకలూరిపేటో అన్నట్లుగా వర్ణించడం ప్రారంభించాడు. అంతేకాకుండా నన్ను తప్పకుండా అక్కడికి రమ్మని ఆహ్వానించాడు. "పోనీ చలికాలం రాలేకపోతే – వేసవిలో రండి చాలా బాగుంటుంది. మీరు వస్తారని వ్రాస్తే సిరిగిల్ వచ్చి ఆహ్వానం అందిస్తాం. అక్కడనుంచి కార్లో రెండువందలమైళ్ళే' అన్నాడు. నేను ఇంతవరకు విశాఖపట్నం దాటి వెళ్ళలేదనీ, ప్రయాణాలు చేయడం అట్టే చేతకాదనీ తెలియదాయనగారికి. మనస్సు మాత్రం భారతదేశమేం ఖర్మం, ప్రపంచంలో ఏ దేశాన్నీ గురించి విన్నా, ఏ ప్రాంతాన్ని గురించి చదువుతున్నా అక్కడికి వెడితే బాగుండును అనిపిస్తూంది.

*మిస్సిసిప్పికి బదులు మూసీ!*

చిన్నప్పుడు జాగ్రఫీ పాఠాలు చదువుతుంటే అనిపించేది ఈ ప్రాంతాలన్నీ చూచివస్తే బాగుండునని. మిస్సిసిపి ఒడ్డున షికార్లు చెయ్యాలని ఎన్నిమార్లో అనుకున్నాను. పుట్టిన తర్వాత కలలు కనికని నలభై అయిదోయేటగా నన్ను మూసీ నది తీరాన షికార్లు చెయ్యగలిగాను.

నైలునదిలోయలో పత్తితోటల్లో పనిచేసే వారి పాటలు వింటూ సంతోషించాలనిపించేది. నాగార్జునసాగర్ నిర్మించే రోజుల్లో పనిచేసే కూలీల పాటలు వినడమే సరిగ్గాపడలేదు. చరిత్రలో తోడుదుర్గాన్ని గురించి చదివి - అక్కడి పూర్వవైభవాన్ని తిలకించాలని ఎంతో ఉవ్విళ్ళూరుతూ ఉండేవాణ్ణి.

ఆంధ్రప్రభవారు ఆఫీసు పెట్టి ఉద్యోగరీత్యా వెళ్ళమని చెప్పడం బట్టి దగ్గరలో వున్న చిత్తూరు చేరి అక్కడి వైభవం ఒక సంవత్సరం చూడగలిగాను. ఎంతకొట్టుకున్నా ప్రయాణాలు ఒక చిన్న పరిధిలోనే జరిగినాయి.

చాలా చిన్నతనంలోనే పెద్దన్నగారి మనుచరిత్ర చదవడం జరిగింది. సిద్ధుడు కాలికి రాసుకున్న పసరు మహిమ తెలిసిన తర్వాత అలాటిదేదైనా వుంటే బాగుండును - రైళ్ళ ప్రయాణాలు చెయ్యకుండా ఆయా తావుల్లో వెళ్ళి వ్రాలుతూ వుండవచ్చుననిపించేది. ఈ రోజుల్లో ఆ పసరెక్కడ దొరుకుతుంది!?. చేతుల్లో పచ్చ వెలిసిపోయేందుకు ప్రయాణాలు చెయ్యాలిగాని.

*మంచుకొండల దగ్గిర మహాకావ్యం.*

"మీరు సిక్కిం వస్తే పర్వతసానువుల్లో మీకో చిన్నడేరా వేయించి అప్పగిస్తాను. కాఫీ వగైరాలన్నీ పుష్కలంగా సప్లయిచేయిస్తాను. ఒక కావ్యం వ్రాసుకొందురుగాని. దాన్ని హిమాలయానికే అంకితమిద్దురుగాని." అని ఆయనగారు నా మనస్సు ఉప్పొంగేలాగా చెప్పారు.

నిజమే! అంతటి ప్రశాంతతో అక్కడ లభిస్తుంది. అంతటి ఉన్నతి తొంగి చూస్తుందా శిఖరాలవంక చూస్తుంటే కానీ ఈ బొందెను అక్కడికి చేర్చడమెలా. మళ్ళీ ఇక్కడకు చేర్చడమెలా.. బెజవాడ వదిలి రెండు నెలలుంటేనే చెప్పలేని బెంగపుట్టుక వచ్చింది.

ఎవరెస్టు శిఖరారోహణ జరిపిన మహనీయుడు టెంజింగ్. "ప్రజలలో క్రమశిక్షణ అవసరమనుకుంటే వారిని పర్వత ప్రాంతాలకు పంపండి. మీకు మంచి మిత్రులు కావాలంటే మంచుకొండలకు రండి" అన్నాడు. ఈ ఆధునిక యోగి చెప్పిన సత్యాలివి.

పూర్వం మహాయోగులు, ఋషులు, పర్వతసీమల్లో ఏకాంత జీవనం గడుపుతూ క్రమశిక్షణనే కాకుండా శాంతిని కూడా సంపాదించుకోగలిగారు. మహానగాలు ఆముష్మిక ప్రపంచానికి ఆలంబలననే సంగతి అందరూ గ్రహించిందే అక్కడికి చేరడమెలా అన్నదే నాబోటివారికి ప్రశ్న.

ఈ కాలంలో విమానాలు వచ్చినాయి గనుక చాలామంది అతితేలికగా ఒక దేశం నుంచి మరో దేశానికి ఉరుకుతున్నారు అమెరికాలో ఉన్నవాళ్ళు అదిలాబాద్‌లో ఉన్నట్లుగా భావిస్తున్నారు. ఇండియాకు పురుళ్ళకు వస్తున్నారు. పిల్లవాడు పుట్టిన తర్వాత నెలదాటకముందే అట్లాంటిక్ సముద్రం దాటుతున్నారాపాపడితో.

*'గోల్కొండ ' స్పీడుకే కేరింతలు*

చెవుల్లో దూది తియ్యకూడదని పెద్దలు చెప్పే సమయంలోనే బాలింతరాండ్రు రివ్వున విమానంలో ఎగురుతున్నారు. పిల్లవాడికి కోసిన బొడ్డు ఎండకపూర్వమే "ఎయిర్ ట్రావెలర్" అయిపోతున్నాడు. కానీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కి "వోహో! వోహో ఏమి స్పీడు.. ఏమి స్పీడు. వాయువేగంతో పోతోంది. మనోవేగానికి మించిపోయింది" అని ఆశ్చర్య సంభ్రమాలు ప్రకటించే నాబోటివారు ఇంకా చాలామంది ఉన్నారు దేశంలో.

మొన్న ఒకరోజున ఒక యువతీమణి గర్భవతి అమెరికాలో వున్న భర్తకి ఫోను చేసింది. సరిగ్గా అరగంటకల్లా ఆయన పలికాడు. ఇద్దరూ మాట్లాడారు కొంచెంసేపు. తనకు పురుడువచ్చే టైం అయిందని, అప్పటికి రమ్మని ఆవిడ కోరింది. అలాగేనన్నాడాయన. నేను

రెండు ఆషామాషీలు వ్రాసి అచ్చులో చూసుకునేలోపల ఆయన రావడం కొడుకు పుట్టడం మీరు ఫలానా తారీఖునరండి అని భార్యతో చెప్పి మళ్ళీ వెళ్ళడం జరిగింది.

ఒకరోజు వరంగల్‌కు ట్రంక్‌కాల్ చేస్తే రావడానికి గంటన్నర పట్టింది. అమెరికానుంచి అరగంటా.. ఎనభై మైళ్ళదూరానికి దానికి మూడింతలు టైం. ట్రంక్‌కాల్ సంగతేమిటి? అక్కడికి ఒకసారి వెళ్ళిరావాలన్న నాబోటి వాళ్ళకు విదేశీయాత్ర చేసినంత పని అవుతుంది.

***సిక్కిం ఆహ్వానం సీతాఫలమండీ ఆహ్వానం.***

వెనుక కృష్ణాపత్రికలో పనిచేస్తున్నకాలంలో ఒకసారి అయిదారుగురు మిత్రుల్ని వెంటవేసుకుని కృష్ణానది ఒడ్డువెంట పదిమైళ్ళు నడిచాను. ప్రక్కపొలాలలో వున్న చిలగడ దుంపలు మొక్కజొన్న పొత్తులూ తింటూ నడిచాం. ఒడ్డులు ఎండి ప్రవహిస్తూన్న నది. రెండు కట్టలకూ మధ్యగా సన్నగా ఆ ఎండలో గోధుమ వన్నెతాచులాగా కనిపించిన దృశ్యం ఇప్పటికీ నా మనస్సులో చెరిగిపోలేదు. ఆ యాత్ర మేం చేసిన సాహసయాత్రలలో ఒకటిగా చెప్పుకుంటూ వుండేవారం చాలాకాలం.

సిక్కిం రమ్మంటాడు మా చెల్లెలి కుమారుడు - రెండు నెలలనించీ ఊళ్ళో ఉన్న సీతాఫలమండీ రమ్మంటుంది మా అక్క మనవరాలు. ఒక నెలనుంచీ మలక్‌పేట రమ్మంటాడు మా అమ్మాయి ఆడబడుచు అల్లుడు.

ఆహ్వానాలలో వారి సౌహార్ధ్రం వుంటుంది. కానీ నేను వాటిని అందుకోకపోవడంలో వుంది - ఆషామాషి.

COMMENTS